## క్లుప్తంగా

### ఘనంగా సత్య సాయిబాబా ఆరాధనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ సత్యసాయి బాబా ఆరాధనోత్సవాలను 69వ వార్డు తుంగ్లాంలోని ఆలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజల్లో భాగంగా గాయత్రీ హోమం, మహిళలచే లలితా సహస్ర నామార్చన నిర్వహించారు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, భజన మండలి కన్వీనర్ వెంకటరావు, గ్రూప్ లీడర్ సాయి ధర్మా, నందేశ్వరరావు, మహిళా కో–ఆర్డినేటర్ కొల్లి పద్మ సాయి పాల్గొన్నారు.

### ఉక్కునగర వాసులకు విద్యుత్ చార్జీలు పెంపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు విద్యుత్ చార్జీలు పెరిగాయి. ఈ మేరకు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్ ప్రారంభం నుంచి టౌన్‌షిప్‌లో నివసిస్తున్న అందరు ఉద్యోగులకు రాయితీతో విద్యుత్ చార్జీలు వసూలు చేసేవారు. 2007 వేతన సవరణ అనంతరం అధికారులకు చార్జీలు పెంచినా, నాన్ ఎగ్జిక్యూటివ్‌లకు నామమాత్రంగా విద్యుత్ చార్జీలు ఉండేవి. యాజమాన్యం విడుదల చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి స్టీల్‌ప్లాంట్ చెల్లించే విద్యుత్ చార్జీలు క్వార్టర్స్‌లో ఉంటున్న అందరి నుంచి ఏప్రిల్ 10 నుంచి వసూలు చేస్తామని పేర్కొన్నారు.

### ఏడో రోజు ఐదు నామినేషన్లు

గాజువాక : గాజువాక నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు బుధవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా గుడివాడ అమర్‌నాథ్ రెండు సెట్లు, రంగూరి హిమగౌరి రెండు సెట్లు, టీడీపీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు మూడు సెట్లు, లోక్ తంత్రిక్ జనతాదళ్ అభ్యర్థిగా తోట అక్కయ్య రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా గవర రోహిణి కుమారి ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్టు గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు మొత్తం 21 నామినేషన్లు అందినట్లు ఆయన పేర్కొన్నారు.

### స్వతంత్ర అభ్యర్థిగా జనసేన వీరమహిళ

గాజువాక : జనసేన పార్టీ సీనియర్ వీర మహిళా నాయకురాలు గవర రోహిణి కుమారి గాజువాక నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. గతంలో టీడీపీ నాయకురాలిగా ఉన్న ఆమె పవన్ కల్యాణ్ జనసేన పార్టీ ప్రకటించిన వెంటనే ఆ పార్టీలో చేరారు. గత జీవీఎంసీ ఎన్నికల్లో 68వ వార్డు నుంచి జనసేన పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా కూడా పోటీ చేశారు. స్వల్ప తేడాతో ఓడిపోయిన ఆమె ప్రస్తుతం ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం చర్చనీయాంశమైంది.

### పల్లా నామినేషన్‌కు పత్తా లేని క్యాడర్

- భోజనం పెట్టి, రూ.300 చెల్లించినా.. పలచగానే జనం

గాజువాక : గాజువాక నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసిన పల్లా శ్రీనివాసరావు జన సమీకరణకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఒకపక్క కూటమి మిత్రులు సహకరించకపోవడం, మరోపక్క సొంత పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కలిసి రాకపోవడం కారణంగా ఆయన జనాన్ని తెచ్చుకోవడానికి తనకున్న 'శక్తి'నంతా ఉపయోగించాల్సి వచ్చింది. ఆ పార్టీకి నియోజకవర్గంలో కార్పొరేటర్లు ఉన్నప్పటికీ కొంతమంది పల్లా శ్రీనివాసరావుతో అంటీముట్టనట్టుగా ఉంటున్న విష యం తెలిసిందే. దీంతో శ్రీనివాసరావు డబ్బులు చెల్లించి జనాన్ని తరలించినట్టు చెప్పుకొంటున్నారు. ర్యాలీలో పాల్గొనడానికి వచ్చినవారికి భోజనం పెట్టి రూ.300 వరకు ముట్టజెప్పినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, ర్యాలీలో బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన క్యాడర్ ఎక్కడా కనిపించలేదు. అక్కడక్కడా వాహనా లపై ఒకరిద్దరి హడావుడి తప్ప ఆ పార్టీల నుంచి కార్యకర్తలు కనిపించలేదు. నాయకులు కూడా ఒకరిద్దరే పాల్గొన్నారు.



# జనసంద్రం

- జనవాకగా మారిన గాజువాక
- ప్రత్యర్థుల కళ్లు చెదిరేలా అమర్‌నాథ్ నామినేషన్
- కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వైవీ సుబ్బారెడ్డి, గుడివాడ అమర్‌నాథ్‌కు అభిమానుల గజమాల



శంఖం పూరిస్తున్న అమర్‌నాథ్



నామినేషన్ పత్రాలపై సంతకం పెడుతున్న వైఎస్సార్‌సీపీ గాజువాక అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న అమర్‌నాథ్



నామినేషన్‌కు భారీ ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

గాజువాక : వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ నామినేషన్ ర్యాలీతో రహదారులు జనసంద్రంగా మారాయి. ఎటు చూసినా జనంతో గాజువాక జనవాకగా మారిపోయింది. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వేల సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. ప్రత్యర్థుల కళ్లు చెదిరేలా సాగిన నామినేషన్ ర్యాలీ విజయోత్సవ ర్యాలీని తలపించింది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ వైఎస్సార్‌సీపీ జెండాలు చేతబట్టి ఫ్యాన్ గుర్తును చూపుతూ కేరింతలు, నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అభిమానులు అమర్‌నాథ్‌పై పూలవర్షం కురిపించారు. గజమాలతో సత్కరించారు.

**మండుటెండను సైతం లెక్క చేయక..**

కార్యకర్తల ఉత్సాహం ముందు ఎర్రటి సూర్యుడు సైతం చిన్నబోయాడు. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ విజృంభించినా కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గలేదు. పార్టీ పెద్దలు వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, వార్డు నాయకులు కూడా ర్యాలీలో పాల్గొనడంతో కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపైంది. జై జగన్, జై అమర్ నినాదాలతో గాజువాక హోరెత్తింది. తల్లి నాగమణి, భార్య హిమగౌరి, సోదరి సురేఖ తదితరులతో కలిసి మింది గ్రామంలోని తన స్వగృహం నుంచి బయల్దేరి జింక్ గేటు వద్దకు చేరుకున్న అమర్‌నాథ్ వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులతో కలిసి ఓపెన్ టాప్ వాహనంలో నామినేషన్‌కు బయల్దేరారు. ఆ వాహనం వెనుక వేలాది మంది జనం, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు అనుసరించగా కొత్తగాజువాక, సినిమా హాల్‌జంక్షన్, పాతగాజువాక, జాతీయ రహదారి మీదుగా చినగంట్యాడ వందడుగుల రోడ్‌లో గల రిటర్నింగ్ కార్యాలయానికి చేరుకున్నారు.

**నామినేషన్ పత్రాల అందజేత**

గాజువాక తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఆయన భార్య నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్‌కు ముందు అమర్‌నాథ్ తన కుటుంబ సభ్యులతో కలిసి సింహాచలం వెళ్లి నృసింహస్వామిని దర్శించుకున్నారు. అప్పన్నకు ప్రత్యేక పూజలు చేసి పెద్దల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం ఆయన పార్టీ ప్రముఖులతో కలిసి రిటర్నింగ్ అధికారి లక్ష్మారెడ్డికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను, ఆయన భార్య హిమగౌరి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, మాజీ మేయర్ పులుసు జనార్దనరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మంత్రి రాజశేఖర్, ఉరుకూటి అప్పారావు, విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, ఉరుకూటి చందు, ఇమ్రాన్, రాజాన రామారావు, భూపతిరాజు సుజాత, నాయకులు గుడివాడ లతీష్, మాటూరి శ్రీనివాసరావు, దొడ్డి రమణ, సిరట్ల శ్రీనివాస్, కోమటి శ్రీనివాసరావు, బోగాది సన్ని, ఇల్లపు ప్రసాద్, పల్లా చినతల్లి, మహలక్ష్మి నాయుడు, యువశ్రీ, తిప్పల స్వాతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు గ్యారంటీలకు నో వారంటీ

ఏడాదిన్నరగా చంద్రబాబు పట్టుకు తిరుగుతున్న గ్యారంటీ కార్డుకు వారంటీ అయిపోయిందని వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గాజువాక అభ్యర్థిగా నామినేషన్ వేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తామనే నమ్మకాన్ని జగన్ మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. అందుకే ఈ నెల 26న రానున్న మ్యానిఫెస్టో కోసం ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ఇప్పటికే అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి ప్రణాళికలకు మించి మ్యానిఫెస్టో ఉండే అవకాశం ఉందన్నారు.

**స్థానిక మ్యానిఫెస్టో**

గాజువాక సమగ్రాభివృద్ధి కోసం స్థానిక మ్యానిఫెస్టోను ప్రకటిస్తామని అమర్‌నాథ్ తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమన్నారు. పారిశ్రామిక, పర్యాటక సమగ్రాభివృద్ధిపై వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు వచ్చాయన్నారు. వాటన్నింటినీ క్రోడీకరించి మ్యానిఫెస్టోను విడుదల చేస్తామన్నారు.

# వెల్లువెత్తిన అభిమానం

**వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్ నామినేషన్‌కు తరలిన అశేష జనవాహిని**



గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



86వ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలు



74వ వార్డులో ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి



ఉక్కునగరం నుంచి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు



85వ వార్డు నుంచి ర్యాలీగా వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నామినేషన్‌కు అభిమానగణం వెల్లువలా తరలివచ్చింది. 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లేందుకు మింది చేరుకున్నారు. 69వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు నేతృత్వంలో సుమారు 16వందల మంది కార్యకర్తలు బైక్‌లు, కార్ల తో ర్యాలీగా మింది చేరుకున్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్లు మింది చేరుకున్నారు.

**స్టీల్‌ప్లాంట్ నుంచి తరలిన శ్రేణులు**

ఉక్కునగరం: 78వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సెక్టార్–5 నుంచి కార్లు, బైక్‌లపై ర్యాలీగా బయల్దేరారు. ర్యాలీని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శివ ప్రారంభించారు. వార్డు పరిశీలకులు రాము, నాయకులు వై. మస్తానప్ప, బ్రహ్మయ్య, డి.పుల్లారావు, బి.రామకృష్ణ, నూకెప్పయ్య రమేష్‌కుమార్, కె.అమ్మాజీ, అప్పారావు పాల్గొన్నారు.

**కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో..**

పెదగంట్యాడ: 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో అమర్‌నాథ్ నామినేషన్‌కు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని వంశీరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

**75వ వార్డు నుంచి.. :** 75వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. పెదగంట్యాడ జంక్షన్ వద్ద బైక్ ర్యాలీని ప్రారంభించారు. నాయకులు గొందేశి వెంకటరమణారెడ్డి, మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, వెంపాడ అప్పారావు, గొందేశి పైడిరెడ్డి, గొందేశి సుమన్‌రెడ్డి, గంట్యాడ గోవిందరాజు, పిట్టా రెడ్డి, నాగు పాల్గొన్నారు.

**76వ వార్డు నుంచి..** :వైఎస్సార్ సీపీ 76వ వార్డులో ర్యాలీని పార్టీ నాయకుడు దొడ్డి రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి శంకరనారాయణ, రంబ నారాయణమూర్తి, చిక్కా సత్యనారాయణ, కులుకూరి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

**86వ వార్డు నుంచి..**

గాజువాక: అమర్‌నాథ్ నామినేషన్‌కు 86వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో అభిమానులు సుమారు 1000 బైకులతో ర్యాలీగా వెళ్లారు.

**87వ వార్డు నుంచి.. :** జీవీఎంసీ 87వ వార్డులో నుంచి వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు బుధవారం నామినేషన్ వేస్తున్న గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు మద్దతుగా భారీ ర్యాలీగా తరలివెళ్లారు.

- 87వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు బైకులతో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, ఎన్నేటి రమణ, ముద్దపు దామోదర్, ఆడారి శ్రీను, గాలి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**85వ వార్డు నుంచి..**

అగనంపూడి: అగనంపూడి కూడలి నుంచి బయల్దేరిన బైక్ ర్యాలీని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, నక్కా రమణబాబు, బలిరెడ్డి శ్రీను, గెద్దాడ సత్యవతి, పెదిరెడ్ల హరీష్, కొళిరెడ్డి రమణారావు, పార్వతి, దాసరి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.



69వ వార్డులో బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో వెళ్తున్న కార్యకర్తలు



87వ వార్డు నుంచి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు



75వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో..



87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

## ప్రతిభావంతులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న నాయకులు

అగనంపూడి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన అగనంపూడి, పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులను అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అగనంపూడి హైస్కూల్ విద్యార్థినులు వనసా హితి, బలగ సమీరాను, పినమడక స్కూల్ విద్యార్థినులు నీలం కుమారి, ఎస్.ప్రమోదిలను అభినందించారు. కార్యక్రమంలో కొలిపాక అప్పారావు, బి.సత్యనారాయణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో ఉక్కు కార్మిక నాయకులు



గాజువాక పోలీస్ స్టేషన్‌లో కార్మిక నాయకులు

ఉక్కునగరం: కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటన నేపథ్యంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సి.ఎం.రమేష్ నామినేషన్ కార్యక్రమానికి రాజ్‌నాథ్ సింగ్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కూర్మన్నపాలెం దీక్ష శిబిరంలో నిరాహార దీక్ష చేస్తున్న వారిని పోలీసులు బలవంతంగా గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సుమారు 200 మంది పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది వచ్చి, శిబిరంలో ఉన్న నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, యు.రామస్వామి, మసేనురావు, పి.శ్రీనివాసరాజు, సతీష్, వేణుగోపాల్, సూర్యనారాయణ, వి.ప్రసాద్, కె.అప్పారావు, రామకోటిలను అదుపులోకి తీసుకున్నారు. రాజ్‌నాథ్ సింగ్ పర్యటన అనంతరం వారిని విడుదల చేస్తామని పోలీసులు తెలిపారు.

**అరెస్టుపై నిరసన:** శాంతియుతంగా దీక్ష చేస్తున్న పోరాట కమిటీ నాయకులను అదుపులోకి తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం సాయంత్రం ఉక్కు స్మృత్యంజలి పార్కు వద్ద నాయకులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రికి వినతి పత్రం అందించాలని తాము భావిస్తే తమ నాయకులను అన్యాయంగా నిర్బంధించారన్నారు. నీరుకొండ రామచంద్రరావు, వై.టి.దాస్, నరేష్‌కుమార్, చీకటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద వివాదం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ఉక్కు ఉద్యోగి, సీఐఎస్ఎఫ్ సిబ్బంది మధ్య వివాదం చెలరేగింది. ఈ సంఘటనలో ఉద్యోగిపై సీఐఎస్ఎఫ్ సిబ్బంది దాడి చేశారని కార్మిక నాయకులు ఆరోపించగా, మద్యం మత్తులో తమతో ఉద్యోగి అసభ్యకరంగా దూషించారని సీఐఎస్ఎఫ్ సిబ్బంది చెబుతున్నారు. వివరాలిలా.. మంగళవారం రాత్రి బీసీ గేటు ప్రవేశ ద్వారం నుంచి స్టీల్‌ప్లాంట్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఎం.ఎం.ఎస్.ఎం జోన్ ఉద్యోగి కె. ప్రవీణ్‌దేవ్ లోపలికి ప్రవేశిస్తుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది గుర్తింపు కార్డు చూపమన్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఏం జరిగిందో పూర్తి వివరాలు తెలియలేదు. కొద్దిసేపటికి స్టీల్ ప్లాంట్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రవీణ్‌దేవ్‌ను జీపులో స్టేషన్‌కు తరలించారు. అతని ఒంటిపై గాయాలయ్యాయని చెప్పడంతో, అక్కడి నుంచి స్టీల్ ప్లాంట్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ అంశంపై బుధవారం ఉదయం కార్మిక నాయకులు సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ హనీఫ్‌ను కలిసి చర్చించారు. సంఘటనపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## కేంద్ర ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమం

గాజువాక: కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1168వ రోజు, బుధవారం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకుడు ఆదినారాయణ మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కార్మికులు ఎన్నో ఏళ్లుగా శ్రమించారన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**అక్రమ అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు**

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నగరానికి వస్తున్నారనే కారణంగా దువ్వాడ, గాజువాక పోలీసులు దీక్ష శిబిరం వద్దకు చేరుకుని పోరాటం చేస్తున్న నాయకులను, కార్మికులను ముందస్తు అరెస్టులు చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో ఆందోళనకు దిగిన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని గాజువాక స్టేషన్‌కు తరలించడంపై కార్మికులు ప్రతిఘటించారు.

## రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పెదగంట్యాడ: 11కేవీ దిబ్బపాలెం ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 26న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ప్రకటనలో తెలిపారు. గొడ్డువానిపాలెం, గొందేశివీధి, కండిపల్లివీధి, వెంకన్నపాలెం, కొంగపాలెం, సత్యనారాయణపురం, యాతపాలెం, ఉప్పరకాలనీ, గంగవరం, దిబ్బపాలెం ఆర్‌హెచ్ కాలనీ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. పెదగంట్యాడ 11కేవీ ఫీడర్ పరిధి పెదగంట్యాడ మెయిన్‌రోడ్డు, నెల్లిముక్కు, గొడ్డువానిపాలెం, సీతానగరం, దుర్గవానిపాలెం, ఏపీహెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

## పల్లాకు రూ.14.49 కోట్ల ఆస్తి

గాజువాక : టీడీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు తన పేరు మీద రూ. 14,91,399 చరాస్తులు, రూ.7,13,28,000 స్థిరాస్తులు, వివిధ బ్యాంకుల నుంచి రూ.1,44,64,742 మేర రుణాలు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అతని భార్య పల్లా లావణ్య దేవి పేరు మీద రూ.61,34,930 చరాస్తులు, రూ.6,59,68,000 స్థిరాస్తులు, వివిధ బ్యాంకుల నుంచి రూ.89,57,379 మేర రుణాలు ఉన్నట్టు తెలిపారు. హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్) ద్వారా రూ.4,31,766 చరాస్తులు, రూ.19,80,56,717 స్థిరాస్తులు ఉన్నట్టు తెలియజేశారు. కాగా, శ్రీనివాసరావుపై గాజువాక పోలీస్ స్టేషన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లలో క్రిమినల్, సివిల్ కేసులు ఉన్నాయి. ప్రస్తుతం అవి కోర్టుల పరిధిలో ఉన్నట్టు పేర్కొన్నారు.